

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 7వ తేదీన జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం నందు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తెమ్మ తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, వేతనం నెలకు రూ. 17వేల నుంచి రూ.25వేలతో పాటు ఇన్సెంటివ్స్ ఇస్తారన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 7న ఉదయం 10.30గం.ల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

టీడీపీ అడహక్ కమిటీ సభ్యుడిగా నారాయణ రెడ్డి

రాయికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో టీడీపీ 16 మంది సీనియర్ కార్యకర్తలతో అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన రైతు బిడ్డ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు సోమ నారాయణ రెడ్డితో పాటు పట్టణానికి చెందిన కొండ శ్రీధర్‌లను నియమించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు గడువు పొడిగించాలి

రాయికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువును పొడగించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మోతె అంజయ్య సోమవారం వినతి పత్రం పంపారు. 2025 మార్చిలో జరిగే ఎన్నికల కోసం ఓటర్ల నమోదుకు నవంబరు 6వ తేదీన చివరి తేదీగా నిర్ణయించారు. చాలా మంది గ్రాడ్యుయేట్లు ఓట్లు నమోదు చేసుకోలేనందున నవంబరు చివరి వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

వందశాతం లక్ష్యంగా..

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జనవరి నుంచి రెండు పూటలా తరగతులకు ఉత్తర్వులు



జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ, టీఎస్ఆర్ఐఈఎస్ పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన విధి విధానాలు రూపొందించగా డీఈవో, మండల విద్యాధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఈనెల 4వ తేదీ నుంచి ఒక పూట, వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి వార్షిక పరీక్షల వరకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు.

ఒక్కో రోజు ఒక్కో సబ్జెక్టు...

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఒక్కో రోజు ఒక్కో సబ్జెక్టుపై శ్రద్ధ వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 4వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు ఏ రోజు ఏ సబ్జెక్టుపై స్పెషల్ క్లాస్ నిర్వహించాలో నిర్ణయించారు. సంబంధిత ప్రణాళిక ప్రతులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈనెల 4వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు 43 రోజులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సంకల్పించారు. ఈమేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయం నుంచి ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి.

గత విద్యా సంవత్సరం రాష్ట్రంలో 11వ స్థానం..

జిల్లాలో గత విద్యా సంవత్సరం 11,380 మంది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10,898 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 5,379 మంది బాలురు కాగా 5,519 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో 94.40 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లా 11వ స్థానంలో నిలిచింది.

గత ఫలితాల సరళి ఇలా...

జిల్లాలో 2017 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలో 97.35 శాతం ఫలితాలు సాధించి అగ్రబాగాన నిలిచింది. 2018లో స్వల్ప పెరుగుదలతో 97.56 శాతం సాధించింది. 2019లో 99.73 శాతం ఫలితాలు, 2020లో 99.98 శాతం ఫలితాలు వచ్చాయి. ఇందులో బాలురు 99.96 శాతం, 99.98 శాతం బాలికలు తమ సత్తాచాటారు. కరోనా కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021లో వందశాతం ఫలితాలు నమోదయ్యాయి. 2022లో 91.37 శాతం ఫలితాలు వచ్చాయి. వీటన్నింటికి భిన్నంగా 2023లో పదో తరగతిలో 84.05 శాతం ఫలితాలు రాగా, ఇందులో బాలురు 81.19 శాతం, బాలికలు 87.05 శాతం ఫలితాలు సాధించారు. ప్రస్తుతం 2024లో 95.76 శాతం ఉత్తీర్ణత రాగా ఇందులో బాలురు 94.90 శాతం, బాలికలు 96.62 శాతం ఉత్తీర్ణులయ్యారు.

(తరువాయి 8వ పేజీలో..)

కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించండి

ఎమ్మెల్యేకు రైతుల విజ్ఞప్తి



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతులు

జగిత్యాల అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం ధర్మానాయక్ తండా గ్రామానికి చెందిన బంజారా రైతులు తమ కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్లుగా సొసైటీ ఆధ్వర్యంలో వడ్లు కొనుగోలు చేస్తున్నారని, కొనుగోలు కేంద్రానికి స్థలం లేనందున రోడ్డుకిరువైపులా ఆరబెడుతున్నందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని కావున గ్రామ శివారులో ఉన్న ఖాళీ స్థలాన్ని కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే జిల్లా అటవీ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అన్నారు. తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

పొలాసలో విద్యుత్ అధికారుల పొలం బాట



పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

జగిత్యాలరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో సోమవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డివిజన్ ఇంజనీర్ రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు ముట్టవద్దని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున ఎలాంటి సమస్యలు వచ్చిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడీఇ జవహర్‌నాయక్, ఏఈ సుందర్ , మాజీ సర్పంచ్ గాజంగి భారతి నందయ్య, రైతులు, విద్యుత్‌సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
● కలెక్టర్ సత్యప్రసాద్
● వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ
8



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ధర్మపురిలో .. కార్తీక సందడి
● భక్తి శ్రద్ధలతో శివుడికి పూజలు
7



గోదావరి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఉపకార వేతనాల దరఖాస్తుకు నూతన గైడ్‌లైన్స్

ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు, మంజూరు విషయంలో కొత్త మార్గదర్శకాలను పొందుపర్చిందని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. ఈ విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలంటే మూడు దశలైన డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ ఉంటాయన్నారు. విద్యార్థులు మొదటి దశ అథెంటికేషన్‌ను పూర్తి చేసేందుకు ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్, రెన్యూవల్ ద్వారా ఆధార్ నెంబర్‌తో పాటు ఎస్సెస్సీ వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అన్ని వివరాలు మ్యాచ్ అయితే డెమో అథెంటికేషన్ విజయవంతం అయినట్లేనని, కానిపక్షంలో ఆధార్ అప్డేట్ చేసుకొని అప్లికేషన్ చేసుకోవాలన్నారు. మొదటి దశ విజయవంతం అయ్యాక విద్యార్థి మీసేవా కేంద్రంలో రెండో దశ అథెంటికేషన్ కోసం బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. అది సక్సెస్ అయితే అప్లికేషన్ మూడో దశకు చేరుకుంటుందని, అక్కడ అడిగిన వివరాలను పూర్తిచేయాలన్నారు. ఈ మూడు దశల్లో దరఖాస్తు పూర్తి చేసి సదరు దరఖాస్తును తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందని, పై ప్రక్రియ అంతా ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఉంటుందని విద్యార్థులు గమనించాలన్నారు. పూర్తి వివరాలు ఎంట్రీ చేసి మీ సేవా కేంద్రంలో థంబ్ ఇంప్రెషన్ ఇచ్చి, సంబంధిత పత్రాలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం, రూ.నెం. 127, కలెక్టర్ కార్యాలయ సముదాయం, జగిత్యాల నందు ఈ నెల 10వ తేదీలోపు సంబంధిత ధృవపత్రాలు సబ్మిట్ చేయాలన్నారు.

అలరించిన విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక నలంద డిగ్రీ కళాశాల బీకాం, బీబీఏ కోర్సు విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, అనుకున్న లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత సెమిస్టర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం ఫ్రెషర్స్‌డే వేడుకల్లో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్ర మంలో నవ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్, కళాశాల నలంద కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భైరి సురేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు, ఆయా కోర్సుల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

జగిత్యాల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్‌లో నవంబరు 8వ తేదీ నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్ బాల్ పోటీలకు మౌంట్ కార్మేల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జగిత్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ ఎంపిక పోటీల్లో పలువురు విద్యార్థులు పోటీ పడగా మౌంట్ కార్మేల్ పాఠశాలకు చెందిన శివాని, జాహ్నవి అనే ఇద్దరు విద్యార్థులు అండర్-14 విభాగంతో తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ విజ్ఞాన్ వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ సిస్టర్ జ్యోతిస్మరియా, ఫాథర్ రాయప్ప రెడ్డి, సిస్టర్స్ జోస్మి, సీమ, సోఫీ, రాణి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు మంగ, విజ్ఞాన్. సామంత్, హరీష్ తదితరులు ఉన్నారు.

సమస్యలతో తరలివచ్చి..కలెక్టర్‌కు విన్నవించి

- ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ సత్య ప్రసాద్





కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు..ప్రజావాణిలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్

జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 22 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్‌డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంత రావులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచ్‌ల వినతి..

పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి వెచ్చించిన బిల్లులను వెంటనే ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు పలువురు మాజీ సర్పంచ్‌లు వినతిపత్రం అందించారు. సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడం వల్ల అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి చేసిన అప్పులు కుప్పలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విన్నవించారు.

మాజీ సర్పంచుల అరెస్టు అప్రజాస్వామికం

- మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పెండింగ్ బిల్లుల కోసం పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత అన్నారు. మాజీ సర్పంచ్‌లను అరెస్టును వసంత తీవ్రంగా ఖండించి మాట్లాడారు. తమ సమస్యలపై సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు హైదరాబాద్‌కు తరలిన సర్పంచులను అడ్డుకోవడం, నిర్బంధించడం తగదన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుందని మండిపడ్డారు. మాజీ సర్పంచ్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లను బేష రతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పట్టుదల, ఏకాగ్రతతో విద్యార్థులు రాణించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల, ఏకాగ్రతతో విద్యార్థులు మరింత రాణించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసుకొని వైద్యులుగా ఎదిగిన తరువాత సమాజ సంక్షేమంపై సైతం దృష్టి సారించాలన్నారు. మానవతా విలువలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎస్ ఖాద్రీ, సూపరెండెంట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేయాలి

- ఎంపీడీవో స్వరూప
- సిబ్బందికి పలు సూచనలు



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూప

కొడిమ్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, కుటుంబ సభ్యుల నమోదు చేసిన తర్వాత ఇంటికి స్టిక్కర్ అతికించాలని ఎంపీడీవో స్వరూప అన్నారు. సోమవారం మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో కుటుంబ సర్వేకు సంబంధించిన ఎన్యుమరేటర్లకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీలలో ఇళ్ల జాబితాను తయారు చేసి, 9న ప్రతి కుటుంబ వివరాలను నమోదు చేస్తామన్నారు. ఇంటి వివరాల నమోదులో కుటుంబ సభ్యుల పేర్లు, వారు పనిచేసే వివరాలను ఫార్మాట్‌లో నింపాలని సూచించారు. అంతే కాకుండా వైవాహిక స్థితి, వయస్సు, ఆధార్, ఫోన్ నెంబర్లు నమోదు చేయాలసి ఉంటుందన్నారు. 56 ప్రశ్నలతో కూడిన ఫార్మట్‌ను బుక్‌లెట్‌లో సూచించిన విధంగా నింపవలిసిందిగా ఎన్యుమరేటర్లకు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చరణ్‌దాస్, తహసీల్దార్ రమేష్, ఏఈఈ చంద్రశేఖర్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో సలీం, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రావ్యశ్రీ

ఓదెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ హైస్కూల్లో తొమ్మిదోతరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో శ్రావ్యశ్రీ షాట్ పుట్‌లో ఉత్తమప్రతిభను కనబరిచి ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థాయిలో నిలిచింది. దీంతో అండర్17 విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఎంపిక అవ్వడం పట్ల పూర్వవిద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు యేసుదాసు, ఉపాధ్యాయులు, పీఈటీలు పోరెల్ల సదయ్య, తాండ్ర ప్రణయ్ విద్యార్థిని అభినందించారు.

అగ్నిప్రమాదం



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఓఇంట్లో సోమవారం సాయంత్రం ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన జల అనే వివాహిత ఇంట్లో దీపం పెట్టి బయటకి వెళ్లింది. కొద్ది సేపటికి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న 10 వేల నగదు, ఒక బీరువా కాలి బూడిదైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.



ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ సమీపంలోని సర్జిపూల్



మహాబావి


- ఆసియా ఖండంలోనే అతిపెద్దది
- ఒక టీఎంసీ నిలువ సామర్థ్యం
- 92 మీటర్ల లోతు.. 56 మీటర్ల వ్యాసం

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామ సమీపంలో నిర్మించిన మహాబావి ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు లోని నాలుగో లింక్ ద్వారా 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామ సమీపంలో అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించే ప్రదేశం ఎత్తుగా ఉండడంతో నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో తిప్పాపూర్ సమీపంలో సర్జిపూల్ నిర్మాణ పనులు చేపట్టింది. 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వ్యాసంతో మహాబావి నిర్మాణం ప్రారంభించారు. రికార్డు స్థాయిలో 13 నెలల్లో పూర్తి చేశారు. ప్రతీ రోజు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించారు. 3.4 కిలో మీటర్లు కాలువల ద్వారా, 7.6 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా మిడ్ మానేరు నుంచి నీటిని తరలిస్తారు. సర్జిపూల్‌లోని నీటిని ఎత్తిపోయడానికి అండర్ పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పంప్‌హౌస్‌లో నాలుగు భారీ పంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో మోటారు రోజుకు 2,800 క్యూసెక్కుల నీటిని సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుంటాయి.

పంపులు నడవడానికి అవసరమైన విద్యుత్ కోసం సమీపంలోనే 440 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అండర్ పంప్‌హౌస్‌లోకి తొలుత ఇతరులను ప్రవేశం లేకపోయినా ప్రస్తుతం పర్యాటకులను అనుమతిస్తున్నారు.







అన్నపూర్ణ రిజర్వాయర్, అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్

జాతీయస్థాయి కరాటే పోటీలకు 'ఖని' విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌కు గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో శ్రీవర్షిని, ఎం.ముక్తిశ్రీ, బి.సహస్ర, సృష్టి, పి.సహస్ర ప్రతిభ కనపర్చి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జపాన్ షిటోరియో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థును జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం రమేష్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ కె శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, కె శ్రావణ్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అభిజ్ఞ, శివశ్రీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బానేష్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ వీరవిహార్ అభినందించారు.



పతకాలతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వీసీ అభినందన



శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హిమాచల్ ప్రదేశ్‌లో జాతీయ సాహస శిబిరంలో పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అభినందించారు. పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతిని వీసీతో పాటు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మనోహర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ అర్జున్, డాక్టర్ వి రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్‌లు అభినందించారు.

సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ఈ నెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో సేవాదళ్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సేవాదళ్ కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షులు కాసారపు ఎల్లయ్యగౌడ్, నగర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కుమారస్వామి, భద్రేశం, గర్రెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రెండున్నర సంవత్సరాల బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుల కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... గతనెల 27న కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్ రేనా తన రెండున్నర సంవత్సరాల కుమారుడిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్ఐ రాజన్న, కానిస్టేబుల్స్ కుమార్, బషీర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పారు చేశారు. బాలుడి అచూకీ కోసం గాలించిన ప్రత్యేక టీం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ బాలుడిని తల్లి వద్ద నుంచి అపహరించారు. ఆ బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేష్ దంపతులకు 50 వేల వేలుకు అమ్మారు. దర్యాప్తులో ఈ విషయాలను గుర్తించిన పోలీసులు నిందితులైన దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారు. మరో నిందితుడు మోతె కృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



వేంపేట శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని గ్రామంలో సేకరించిన వాటిని అక్రమంగా తరలిస్తునారని వచ్చిన సమాచారంతో ఎస్సై-2 రాజుతో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి వెళ్తున్న టీఎస్01యూసీ5721 నంబర్ గల ఆటోను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 22కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఎండీ హైదర్ అను ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని ఖానాపూర్ మండలానికి తరలిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ అదేశాల మేరకు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై చర్యల నిమిత్తం మెట్‌పల్లి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

నేడు నాగుల చవితి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగోపాసన, సర్పపూజ అనాదిగా వస్తున్న ఆచారం. నాగజాతి విష్ణువుకు తలగడగా, గొడుగుగా, ఆసనంగా, పాదుకలుగా, శివునకు అలంకారంగా, గణపతికి యజ్ఞోపవీతంగా ఉన్నట్లు పురాణ కథలున్నాయి. నాగులను కుండలినీ శక్తిగా భావించి ఆరాధిస్తారు. ఈ దిశలో కార్తీక శుక్ల చతుర్థి నాగులు ఆవిర్భవించిన నాగుల చవితిని మంగళవారం జరుపుకోనున్నారు. ఉపవాసాలు పాటిస్తూ పుట్టల్లో పాలు పోసి, పాలు, నెయ్యి కలిపిన నువ్వులు, బియ్యపు ముద్దలను నైవేద్యంగా పెడతారు. సర్పసూక్తం, అనంత నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరస్తుతులతో అభిషేక, అర్చనాదులు చేసి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలక ధారణ చేసుకుంటారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యా ల గ్రామానికి చెందిన పంది మధుకర్(30) అనే యువకుడు పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పంది మధుకర్ నిత్యం మద్యం తాగుతూ ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం తాగవద్దని వారించిన అతడి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో అక్టోబరు 30న తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమ నించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మధుకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

ఇల్లందకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజూనూర్ గ్రామానికి చెందిన దుండ్ర లత (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందింది. లత భర్త కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చిట్యాల సమ్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిట్యాలకు చెందిన సమ్మయ్య కొయ్యూరు నుంచి నాగెపల్లి గ్రామానికి తన బంధువుల ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి మండలం నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సమ్మయ్య భార్య చిట్యాల సుగుణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

సిరిసిల్ల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణం జిల్లా ఆసుపత్రి మార్చురీ వద్ద 55ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఆసుపత్రి సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి నీలిరంగు షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై పుట్టు మచ్చ కలిగి ఉన్నాడు. మృత దేహాన్ని మార్చురీ గదిలో భద్ర పరిచామని, సంబంధీకులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేల్పుల సంజీవ్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పది రోజుల క్రితం సంజీవ్ సిరిసిల్ల చెందిన రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. జిల్లెల్ల-రామచంద్రపూర్ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సంజీవ్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. రమేష్ పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కుడువాని పల్లె గ్రామానికి చెందిన బోయిని నరసయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చిక్కుడువాని పల్లెకు చెందిన నర్సయ్య ద్విచక్ర వాహనంపై పెద్ద లింగాపూర్ గ్రామానికి వస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలవడంతో వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్‌ను చూపుతున్న బాధితుడు

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో తొమ్మిది ట్రాక్టర్ల బ్యాటరీలు, 18 ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ల బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించారు. సోమవారం ఉదయం ట్రాక్టర్లను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ట్రాక్టర్‌ను పరిశీలించగా బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు సుమారు ఎనిమిది వేలు, ఒక్కో హైడ్రాలిక్ పట్టి ఖరీదు రెడువేల రూపాయల వరకు ఉంటుందని బాధితులు వారి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- అవయవదానం చేసిన తల్లిదండ్రులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కుమారుడి బ్రెయిన్ డెడ్ అయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు. అక్టో బరు 24న మాతంగి కాలనీవద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన మాదాసి సాయినితీష్ (23) తీవ్రంగా గాయపడ్డాడు. చావు బతుకుల మధ్య పోరాటం చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణించాడు. నితీష్ తల్లిదండ్రులు గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్లను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేయగా యశోద ఆసు పత్రిలోని సిబ్బంది నితీష్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మల్లేష్, ఉమ మాట్లాడుతూ తమ కుమారుడు బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినా అవయవదానం చేసి ఇతరులకు ప్రాణం పోశాడన్నారు.



మాదాసి సాయి నితీష్ (ఫైల్)

●రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమేష్ నగర్‌కు చెందిన మాదాసి సాయి నితీష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. వారి తల్లిదండ్రులను ఓదార్చారు.

రంగు మార్చే రాశిగుట్ట


పసుపు వర్ణంలో చేతులు


బలపం రాళ్లు


రాశిగుట్టపై అంజనేయస్వామి దేవాలయం

అటవీప్రాంతంలో ఉన్న ఆ గుట్టకు ప్రత్యేకత ఉంది. గుట్టపైకి వెళ్లే సరికి చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారిపోతాయి. గుట్టపై లెటరైట్ శిలలు ఉన్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఇలా జరుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో రాశిగుట్టకు సంబంధించి మరిన్ని విశేషాలు..

- గుట్టపై లెటరైట్ శిలలు
- వాతావరణ మార్పులతో పుసుపు రంగు ధూళి

వీర్నపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల శివారు లోని అటవీప్రాంతంలో రాశిగుట్ట ఉంది. ఈ కొండ పైనే వెలిసిన అంజనేయస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వెళ్తుంటారు. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చేతులు, కాళ్ల పసుపు రంగులోకి మారి పోతుండడాన్ని భక్తులు గమనించారు. రాశిగుట్ట విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, పరిశోధకుల బృందం ఇటీవల రాశిగుట్టను సందర్శించింది. బృందం వెల్లడించిన వివరాల ప్రకారం.. గుట్టపై భాగాన లెటరైట్ శిలలు ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాపాతం ఉన్న ప్రాం తాల్లో ఇవి ఏర్పడతాయి. ఈ శిలలు వాతావర ణానికి ఆక్సీకరణం చెంది గుల్లలు గుల్లలుగా స్పాంజి వలే తయారవుతాయి. జాజు, పసుపు రంగు లేదా నారింజ రంగను సంతరించుకుంటాయి. ఈ క్రమంలో గుట్టపై పసుపు రంగు ఉన్న ధూళి గాలిలోకి చెట్లపైనా, రాళ్లపైనా చేరుతుంది. భక్తులు వాటిని తాకిన సందర్భంలో చేతులకు, గుట్ట ఎక్కుతుండగా పాదాలు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి.

వాతావరణ మార్పులతో పసుపు వర్ణం
రత్నాకర్‌రెడ్డి, చరిత్ర పరిశోధకుడు

వాతావరణ మార్పులతోనే రాశిగుట్టపై ఉన్న శిలల నుంచి వచ్చే పసుపు రంగు ధూళిలో కలు స్తోంది. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చెట్లు, రాళ్లను తాకినప్పుడు భక్తుల చేతులు, కాళ్ల పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. ప్రభుత్వం రాశిగుట్టను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేయాలి. రాశిగుట్టకు వెళ్లే దారి చూపే గుర్తులు ఏర్పాటు చేయాలి.


రాసిగుట్ట ప్రాంతం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ


ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీ ల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధిం చింది. ఫైనల్‌లో వరంగల్ జట్టుతో తలపడి ద్వితీయ స్థానం సాధించి నట్లు తెలం గాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్ధన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొం డ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, అమర్, సాయికృష్ణ, దుర్గరాజ్, సురేం దర్, కృష్ణహరి, తదితరులు అభినందించారు.

ఓయూ రిజిస్ట్రార్‌గా రేగడిమద్దికుంట వాసి


గడ్డం నరేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న వైస్ ఛాన్సలర్ కుమార్

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ రిజి స్ట్రార్‌గా సుల్తానా బాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన గడ్డం నరేష్ నియమితలయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌గా నియమి తులైన గడ్డం నరేష్‌కు సోమవారం యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. సుల్తానాబాద్ మండంలోని రేగడి మద్ది కుంట వాసి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులు కావడంపై గ్రామస్థులు, నరేష్ చిన్ననాటి స్నేహితులు పల్లా వాసు, మంద శ్రీనివాస్, కొమురెవల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పట్టించు కోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్య విధానం అమలు చేయ బోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. విద్యా శాఖ సీఎం వద్దే ఉంచుకొని కనీసం ఇంత వరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన మాటలకు నేడు ముఖ్యమంత్రిగా చేస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. పది సంవత్స రాల కాలంలో గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నా రు. వారి వైఖరి కారణంగా విద్యార్థి, యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పని చేశారన్నారు ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతు లు లేక, చాల పాఠశాలలు మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. సాంఘిక, సం క్షేమ, గురుకులాల ఉన్న విద్యార్థులు సమస్యలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్ర మంలో ఏఐఎస్ ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీవర్ధన్, అభిరామ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

కరీంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ, పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గాలకు చెందిన వారు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నియోజకవర్గాలకు పదవీ కాలం 2025 మార్చి 29వ తేదీతో ముగుస్తుం దన్నారు. ఆన్‌లైన్, ఏఈఆర్వీ కార్యాలయాల్లో నేరుగా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు తెలియజేయ వచ్చ న్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయ ఎన్నికల కోసం ఫారం-19లో దరఖాస్తు చేసుకో వాలని కలెక్టర్ సూచించారు.

108లో ఉద్యోగ అవకాశాలు

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో గల 108 వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా మేనేజర్ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బీ- ఫార్మసీ, ఎం-ఫార్మసీ లేక ఇంటర్మీడి యట్‌లో బైపీసీ లేదా ఏదేని మెడికల్ డిప్లొమా చేసినవారు, 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 6న జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9100799257 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక శోభ


కోటిలింగాల, ధర్మపురిలో గోదావరి వద్ద హారతి




ధర్మపురిలో గోదావరి నదిలో దీపాలు వదిలి పెట్టుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజే శ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆల య ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ అర్చ కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామితోపాటు అనుబంధ పరివార దేవతలకు అర్చ నలు, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

రాజన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహిక కార్తీక దీపో త్సవం కార్యక్రమాన్ని సోమవారం ఈవో వినోద్‌రెడ్డి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లత బృదంతో ఏర్పాటు చేసిన భక్తి విభావరి గానం ఆకట్టుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామ కృష్ణ కళాకారులను సన్మానించారు.

ఘనంగా మహాలింగార్చన

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రం కోటిలింగా లలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గోదా వరి మాతకు పూజలు చేసి హారతినిచ్చారు. ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కార్తీక మాసంలో పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ఆలయ ఈవో, ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయంలో భక్తులు ఓం, స్వస్తిక్ ఆకారంలో ఆకట్టుకు నేలా దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి తిలకించారు.

ధర్మపురిలో కార్తీక సందడి

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెల కొంది. కార్తీక మాసం సంద ర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వర స్వామి, అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి న దిలో భక్తులు కార్తీక స్నానా లు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యా ణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిత్య పూజ లు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.

మూడో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి మూడవ రోజు సోమవారం సాయం త్రం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నదీ మాత కు హారతి ఇచ్చి కార్యక్రమం నిర్వహిం చారు.




భక్తజనంతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ

అరుణాచల గిరి దర్శనానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తమిళ నాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణ చల గిరి దర్శనానికి మంథని ప్రాంతం నుంచి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డీఎం శ్రావణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి అరుణాచలం గిరికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు సదుపాయాన్ని కల్పించామన్నారు. వెళ్లేటప్పుడు దారిలో ఉన్న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం, తిరుగు ప్రయా ణంలో అలంపూర్ జోగులాంబ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. ఈనెల 16న రాత్రి 12 గంటలకు బస్సు గోదావరిఖని చేరుకుంటుందన్నారు.ప్రయాణానికి పెద్దల కు రూ.4850, పిల్లలకు రూ. 4000 చార్జీ అవుతుందన్నారు. అసక్తి కలిగిన భక్తులు ఆర్. మెండయ్య సెల్ నంబర్ 994953 1412ను సంప్రదించాలని సూచించారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచ లం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును నడిపి స్తున్నట్టు ఖని ఆర్‌టీసీ డిపో డీఎం నాగ భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. న వంబరు 13న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలు దేరి మరుసటి రోజు అరుణాచలానికి చేరు కుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.4800 చార్జి నిర్ణయించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 7382847316, 738284 7427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఖని'లో నేడు దాశరథి, జాషువా సాహిత్య సభ

హాజరుకానున్న దేశపతి, కోటేశ్వరరావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళ వారం సాయంత్రం గోదావరిఖని మార్కం డేయకాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో దాశరధి, గుర్రం జాషువాల సాహిత్య సదస్సు జరుగనుంది. ఈ మేరకు చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు ఎం.విజయానంద్ ఒక ప్రటనలో తెలిపా రు. సాహిత్య సభకు ఎమ్మెల్సీ, గాయకు డు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సీటీ కళాశాల తెలుగు విభాగం డీన్ కోటేశ్వర్‌రావు హాజరవుతున్నారని పేర్కొ న్నారు. దాశరధి సాహిత్యంపై దేశపతి, గుర్రం జాషువా కవిత్వంపై కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. కాగా సాహిత్య సభకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సాహితీ అభిమానులు, తెలంగా ణ వాదులు, సామాజిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌యూ ఫార్మసీ కళాశాలను పట్టించుకోరా..?



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల

- రేకుల షెడ్లలో హాస్టల్
- కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాత వాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సమస్య లతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 103 మంది విద్యార్థులు ఉన్నా రు. 1980లో ఫార్మసీ కళాశాలకు 42.14 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించారు. తర్వాత అందులో ఐదెకరాల భూమిని ఉర్దూ యూనివర్సిటీకి కేటాయిం చారు. మిగతా 37.14 ఎకరాల యూనివర్సిటీ భూమి ఎంత కబ్జాకు గురైందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రహరీ నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాం సమీ పంలో ఎస్సారెస్పీ క్వార్టర్స్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్లు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. వర్షం కురి స్తే హస్టల్ గదులు ఊరుస్తుంటాయి. కళాశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళలో బయ టకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం..
ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్



ఫార్మసీ కళాశాలలోని సమస్యల ను త్వరలో పరిష్కరిస్తాం. రూ. 2.2 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి ప్రతి పా దనలు రూపొందించాం. ఈ ప్రతి పాదనలను యూనివర్సిటీ ఎగ్జిక్యూట్ కౌన్సిల్ ముం దుంచి ఆమోదం తీసుకుంటాం. 2.8 కోట్లతో అదనంగా నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. హాస్టల్ భవనం నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నాం.


రేకుల షెడ్లలో హాస్టల్



నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కోరుట్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి హైజంప్ పోటీ లకు కోరుట్ల మండలం మాదాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న బత్తిని రసజ్ఞ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండెల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. రసజ్ఞతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం సన్మానించి అభినందించారు.

ఆర్ఎంపీ, పీఎంపీ మండల అధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్

కొడిమ్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ, పీఎంపీ కొడిమ్యాల మండల సం ఘం అధ్యక్షుడిగా పులి వెంకటేష్‌గౌడ్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బారాజు నర్సింహారెడ్డి, ఉపాధ్య క్షులుగా మల్యాల మారుతి, శ్రీమంతుల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా రామిడి సతీష్‌రెడ్డి, కోశాధికారిగా కొండూరి ప్రవీణ్‌కుమార్, ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా దీకొండ ఆనం దం, అధికార ప్రతినిధిగా చెన్నూరి గంగాధర్, సహాయ కార్యదర్శులుగా రాజేందర్‌రెడ్డి, సుదర్శన్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, నరేష్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

కథలాపూర్, నవంబరు 4 : జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పుట్‌బాల్ పోటీల్లో మండల కేంద్రంలోని మాన్‌స్టో పాఠశాల విద్యార్థి చెదలు వరుణ్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడని ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ తెలిపారు. సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, పీఈటి మల్లేశ్, లింబా, శ్రావణి అభినందించారు.

మాజీ సర్పంచుల అరెస్ట్ సరికాదు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను అభివృద్ధి చేసిన మాజీ సర్పంచులను అరెస్టులు చేసి అక్రమంగా పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడం సరికాదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తీవ్రంగా విమర్శించారు. అరెస్ట్ అయిన సర్పంచులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఇచ్చిన పిలుపునకు పోరుబాటకు వెళ్లకుండా ముందస్తుగా మాజీ సర్పంచులతో పాటు భర్తలను సోమవారం పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు ఆకుల రాజారెడ్డి, శేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు అంజయ్య ముద్దం రాజేష్, ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను సోమవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో జరిగే మహా ధర్నాకు మాజీ సర్పంచులు వెళుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ గంగుల మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ముందస్తుగా వారిని అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, శేఖర్, మహేష్, రమేష్, శ్రీనివాస్, తిరుపతి ఉన్నారు.

బీర్‌పూర్: మాజీ సర్పంచ్‌లను సోమవారం బీర్‌పూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు తరలి రావాలని ఇచ్చిన పిలుపు మేరకు, మండలంలోని మాజీ సర్పంచ్‌లను ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో ముందస్తుగా అరెస్ట్ చేశారు. తాళ్ల ధర్మారం సర్పంచ్ నల్ల మహిపాల్ రెడ్డి, కొల్వాయి సర్పంచ్ యేసుదాసు, చిన్న కొల్వాయి సర్పంచ్ రవీందర్ ఉన్నారు.

రాయికల్: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను రాయికల్ పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులకు రాయికల్ కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ మహేష్ గౌడ్, బీఆర్ఎస్ యూత్ నాయకుడు వెంకటేష్ నాయక్ మద్దతు తెలిపారు.

మల్లాపూర్ : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరమ్ పిలుపు నివ్వగా ముందస్తు చర్యలో భాగంగా మండలంలోని పలు గ్రామ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో ఉన్న మాజీ సర్పంచుల స్వంత పూచికత్తుపై విడుదల చేశారు.



మాజీ సర్పంచులను అరెస్ట్ చేసిన రూరల్ పోలీసులు

జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లో జరుగుతున్న సర్పంచుల మహాధర్నాకు బయల్దేరివెళ్తున్న జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన మాజీ సర్పం చులను సోమవారం జగిత్యాల రూరల్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ధ రూర్ గ్రామ మాజీసర్పంచ్ ప్రభాకర్, మోతె మాజీ సర్పంచ్ స్వప్నరాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, జాన్ ఉన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం వేకువజామున ముందస్తు అరెస్టు చేశారు.

కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, వనతడుపుల అంజయ్య, కేతిరెడ్డి బాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాయికల్ మండలంలోని మైతాపూర్, రామాజీపేట గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధాన్యం ఎంత మొత్తంలో వస్తుంది, ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకుని దాని మ్యాచర్ ఏ విధంగా ఉందని తనిఖీ చేశారు. సంబంధిత ఏఈవోను కేంద్రం ఏ విధంగా నడుస్తుందని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఖయ్యూం, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం మ్యాచర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

●ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుందని రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మండలంలోని అల్లీపూర్ పరిధిలోని పెద్దమ్మ గుడి, అయోధ్య గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పాలక వర్గ సభ్యులు జితేందర్, రాజిరెడ్డి, బక్కయ్య, వెంకటేశ్వర్ రావు, గ్రామ నాయకులు గంగారెడ్డి, మోర వెంకటేశ్వర్లు, సాగర్‌రావు, ఏఈవో సుమలత, సీఈవో ఉపేందర్‌రావు, పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఒడ్డెలింగాపూర్, ధర్మాజీపేట, బోర్నపెల్లి గ్రామాల్లో భూపతిపూర్ సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు ముత్యం రెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగుల మల్లయ్య, డైరెక్టర్‌లు పాల్యా రమణ, కోసరి మహేష్, ధర్మాజీపేట క్లస్టర్ ఏఈవో నరేష్, పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్యంగా..

5వ పేజీ తరువాయి..

● పాఠశాల పరిస్థితులకు తగినట్లుగా కాలపట్టిక రూపొందించుకోవాలి.

● నవంబరు 4వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ఒక్క పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.

●ఇందులో రెగ్యులర్ తరగతులు బోధించకుండా పునశ్చరణ, మూల్యాంకనాలపై దృష్టి పెట్టాలి.

● జనవరి నుంచి వార్షిక పరీక్షల వరకు రెండు పూ టలు ఉదయం 8-9 గంటల వరకు సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.

● విద్యార్థులు తప్పని సరిగా ప్రత్యేక తరగతులకు హజరయ్యేలా సబ్జెక్టు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవా లి. ఇందుకు ప్రత్యేకంగా రిజిస్టర్ పెట్టాలి.

● విద్యార్థులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ వారి ప్రగతిపై సమీక్షలు నిర్వహించాలి.

ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్య వేక్షిస్తూ చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● పిల్లల సామర్థ్యాల ఆధారంగా లఘు పరీక్షలు పెట్టాలి.

●వెనుకబడిన విద్యార్థుల ఫలితాల పరంగా ముందుకు వెళ్లేలా ప్రోత్సహించాలి.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

జగన్ మోహన్ రెడ్డి, డీఈవో



జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష ఫలితాల పరంగా ప్రత్యేక పరంగా గుర్తింపును తీసుకవస్తాము. తమ పాఠశాలలో ఆయా సబ్జెక్టు ఉపాధ్యా యులు సమన్వయంతో గత ఫలితాలకు ధీటుగా మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులకు గుర్తించి ప్రత్యేక దృష్టి సారించి చదివిస్తున్నాం.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి..



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

కొడిమ్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాలలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మండల బీజేపీ నాయకులు ఆది వారం రాత్రి వినతి పత్రం అందించారు. కొడిమ్యాల నుంచి గోవిందారం మీదుగా తాండ్రాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం పెరగటంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వినతి పత్రంలో పెర్కొన్నట్లు వారు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సర్వే చేయించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. వనతి పత్రం అందించిన వారిలో బీజేపీ మండల నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, రాజేశం, గౌతంరెడ్డి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, సత్యనా రాయణ, జనార్దన్, భూమేష్, శ్రీనివాస్, దేవయ్య, రాకేష్ ఉన్నారు.



పామూరు కనిగిరి బస్సును ప్రారంభిస్తున్న డీఎం దేవరాజు

పామూరు, కనిగిరికి బస్సు ప్రారంభం

మెట్‌పల్లి టౌన్, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి నుంచి పామూరు, కనిగిరికి ఆర్టీసీ బస్సును సోమవారం మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి పరిసర ప్రాంతాల నుంచి పామూరు, కనిగిరి ప్రాంతాలకు రవాణా ఎక్కువగా ఉన్నందు వల్ల ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి రోజు మెట్‌పల్లి నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ప్రయాణికుల అన్‌లైన్‌లో కూడ టికెట్‌లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పామూరు, కనిగిరికి బస్సు సేవలను ప్రారంభించడం అభినందనీయమని సుభీభవ ఆర్గనేజేషన్ వ్యవస్థాపకులు బొక్కినపల్లి నాగరాజు అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది ఐఆర్‌కె రెడ్డి, నాగన్న, సురేష్, రాఘవ, శేఖర్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం

కోరుట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నన్నపనేని సేనపతి రాజును ఎస్‌జేడబ్ల్యు హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు విజయ్ సోమవారం ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నన్నపనేని సేనాపతి రాజును రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రకటించి అతనిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన రాష్ట్ర చైర్మన్ సేనాపతి రాజు మాట్లాడారు. మానవ హక్కులను కాపాడి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా చొరవ చూపుతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు విజయ్‌లతో పాటు హెచ్‌ఆర్‌సీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సేనాపతిని పట్టణానికి చెందిన పలువురు ఫోన్ ద్వార అభినందించి హర్షం ప్రకటించారు.



రాజుకు నియామక ప్రతం అందిస్తున్న జాతీయ చైర్మన్ విజయ్

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని గ్రామాల్లో 6 నుంచి చేపట్టే సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. సోమవారం మండలంలోని ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఎన్యూమరేటర్లకు ఇంటింటి సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్థిక, విద్య, వైద్య, ఉపాధి, రాజకీయ అంశాలపై ప్రజల నుంచి పకడ్బందీగా వివరాలను సేకరించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి సత్యానారయణ, ఎమ్ఈవో చంద్రశేఖర్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

మల్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. పంట కొనుగోలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అన్ని రకాల వడ్లకు మద్దతు ధర ఇస్తూ, బోనస్ 500 రూపాయలను చెల్లించాలని వారు కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, నాయకులు బొట్ల ప్రసాద్, మల్లేశం, సురేష్, రమేష్, రమ, రాములు, గంగాధర్, మహిపాల్‌రెడ్డి, కిషన్ ఉన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ

దీపోత్సవం నిర్వహించిన మహిళలు

మెట్‌పల్లి టౌన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహిళలు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, ఎర్దండి గ్రామాలలో సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పాత్రికేయుడు చింతకుంట సాయి కుమార్ తండ్రి గంగారాం, మైనార్టీ నాయకులు రవూఫ్ భార్య ఫర్హానా బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. అలాగే ఇటిక్యాల గ్రామానికి చెందిన బొడుగం జితేందర్‌కు ఆపరేషన్ కాగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజ రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ జడ్పీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థుల అల్పాహారం కోసం విరాళం అందజేత

సారంగాపూర్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అల్పాహారం కోసం రూ, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఐదు వేలు అందించాడు. మండలంలోని రంగపేట ప్రభుత్వ పాఠశాలలో పని చేసిన పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఏ కైలాసం ఆ పాఠశాల పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం నిమిత్తం రూ, ఐదు వేలను పాఠశాల ఉపాధ్యాయులు వి రాజగోపాల్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ప్రధానోపాధ్యా యులు సత్యనారాయణ, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పెగడపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో ఎట్టకేలకు సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడి ధాన్యం అక్కడే రైతుల ఎదురు చూపులు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వార్త ప్రచురితం కాగా జిల్లా అదనపు కలెక్టర్ మండల కేంద్రంలోని సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంతో పాటు అయిత్‌పల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను సోమవారం సందర్శించి వెంటనే కాంటాలు ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు పట్ల రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరుస క్రమంలో తూకం వేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. డీఎస్‌వో జితేందర్, డీఎం సివిల్‌సప్లై రజనీకాంత్, తహసీల్దార్ రవీందర్, సిఈవో గోపాల్ రెడ్డి, ఏపీఎం సమత ఉన్నారు



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కేంద్ర పథకాలతో పేదలకు న్యాయం

కథలాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలతో పేద లకు ఎంతో న్యాయం జరుగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోసానిపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మోదీ పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని ప్రపంచంలోనే దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టారని తెలిపారు ఈ సందర్భంగా కంటె సత్యనారాయణ, బత్తుల రవి, అంజనేయులు తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌కు సన్మానం

కథలాపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులైన మండలంలోని భూషణరావుపేటకు చెందిన కూన అశోక్‌ను సోమవారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువ చేసేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. మండల అధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, శ్రీహరి ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కోరుట్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్‌ల పోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, మాదాపూర్ సింగిల్ విండో చైర్మెన్ అధిరెడ్డితో కలిసి దారిశెట్టి రాజేష్ మాట్లాడారు. మోసపూరితమైన వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులను తొలగించడంలో విఫలం అయిందని అన్నారు. రుణమాఫీ, రైతు బంధు పథకం రైతులకు అందించకుండా ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. రైతుల పక్షాన పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. వరి ధాన్యానికి బోనస్ అందిస్తామని అందించడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఇచ్చిన మాట నిలుపుకున్న కాంగ్రెస్'

మల్లాపూర్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు వర్ద సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణను దేశంలోని అన్ని రాష్ట్రాల్లో చేపడుతామని పార్టీ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. కులగణన చేపడ్డడం చాలా అభినందనీయమని విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషనులతో పాటు స్థానిక చట్ట సభలలో బీసీల సంఖ్య పెరిగి అందరికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి బీసీలకు న్యాయం చేసే విధంగా కులగనన చేయడం హర్షదయాకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలు, డీజిల్ బిల్లులపై విచారణ జరపాలి

అదనపు కలెక్టర్‌కు వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ఫిర్యాదు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నియామకాలు, డీజిల్ ఖర్చుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌తో పాటు పలు వురు కౌన్సిలర్లు సోమవారం జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడారు. రెండు నెలల క్రితం సుమారు 10 మంది పారిశుధ్య కార్మకులను నియమించారనే స మాచారం తమకు ఉందన్నారు. ఒక వేళ కార్మికుల నియామకం జరిగితే తక్షణమే వారి జీతభత్యాలు ఆపివేయాలని, నియామకాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. అదే విధంగా ప్రతి నెల డీజిల్ ఖర్చుల కింద సుమారు రూ. 8లక్షల ఖర్చు చేయగా ఆరు నెలలుగా సమారు రూ. 10 లక్షలు పైగా ఖర్చులు చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కప్పల శ్రీకాంత్, బోడ్డ జగదీష్, అనిల్, రాము, బద్దం లత, జగదీష్‌లు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

సంక్షిప్త సమాచారం

ధర్మపురి: ధర్మపురి మండలంలోని రాజారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 2001-2002 పూర్వ విద్యార్థులు స్మార్ట్ టీవీ సోమవారం బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు సాదు శ్రీకాంత్, ధర్మపురి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, రాజారం ఉన్నత పాఠశాల హెచ్ఎం రావులపెల్లి వెంకటరమణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నాగారం గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందింది. గేదె విలువ రూ 65,000 వరకు ఉంటుంది. బాధితుడు రూప్ప ఆదిమల్లయ్య ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నారు.

మల్లాపూర్ : కార్తీక మాసం సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సోమేశ్వరకొండ, మొగిలిపేట మహాదేవాలయం, వాల్‌గొండ రామలింగేశ్వరాలయం, వివిరావుపేట గంగా గౌరీశ్వరాలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను చేశారు. అనంతరం దీపరాధన చేశారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పొలాస వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వారు నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సోమవారం గ్రామంలోని రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎల్లాగౌడ్, డాక్టర్లు రత్నాకర్, ప్రజ్ఞ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పెగడపల్లి : ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడాన్ని హర్షిస్తూ సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలలో విద్యార్థినులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కొడిమ్యాల: కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం కొనాలని కోరుతూ మండల బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దారు రమేష్‌కు వినతిపత్రం అందించారు.

ఎండపల్లి : ఎండపల్లి గ్రామానికి చెందిన సభ గీతిక ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో 68వ జాతీయ ఎస్‌జీఎఫ్ అండర్ 17 వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు సంగం సాగర్, పీసు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్‌ల భర్తలు సున్నం సత్యం, జగన్, గంగాధర్‌లు ఉన్నారు.